

మళ్లీ వీధులకొచ్చాడు. కానీ, ఈసారి అన్న పృథ్వీశ్వరునికి తన ఆలోచనల్లోని కళాకేంద్రం గురించి చెప్పి తగిన ఆర్థిక సహాయానికి ఆమోదం తీసుకుని మరీ వచ్చాడు.

ద్వీపరాజ్యమంతా పర్యటించసాగాడు. వెంట పరాశరుడు. ఎగువన కొద్దూర నుంచి దిగువన చోళపాండ్యపురం, శ్రీకాకుళం.. దాటి కింద గుద్రవాడనాడు, పాంబుర్రు, బంటులపల్లెనాడు దాటి కొల్లేరు చెరువులవరకూ ఉన్న గ్రామాలను.. కవి, పండిత, కళాకారులను కలుస్తూ మొత్తం వెలనాడు కళాప్రపంచం గురించి పూర్తి అవగాహన సాధించాడు.

సోమాంబిక, భాగవతుల సిద్ధయ, పరాశరుడు, మువ్వ, సూరప్పడులతో మొదలైన కూసెనపూండి జాయపుని పర్ణశాల.. కొద్దిరోజులకే పెద్దన కళాగృహం లాగా కవి, గాయక, పండిత, నాట్య, సంగీత వాద్యకారులతో పరిమళించసాగింది. పరాశరుడు గుద్రవాడ నుంచి కుటుంబంతో కూసెనపూండి వచ్చేశాడు. పూర్తి నిర్వహణ బాధ్యతలు తీసుకున్నాడు. మువ్వను గడ్డిపాడు నాట్యగురుకులంలో సోమాంబిక అనుచరురాలిగా ఉంచాడు.

నాట్యారామంలో సోమాంబికకు సహాయపడుతూ గోపాలునిపై పాటలు కడుతూ పాడుతూ.. ఉత్సాహం పెరిగినప్పుడు నాట్యమాడుతూ.. భర్త గోల లేకుండా అలౌకిక మధురభక్తి వాహినిలో ఓలలాడుతున్నది మువ్వ. కానీ, భక్తుల జీవితాలతో ఆడుకోవడం శివుడైనా గోపాలుడైనా.. ఆ దేవుడికి మహాఇష్టం కదా!

ఓరోజు పరాశరుడు ఒళ్లంతా గాయాలతో పడుతూ లేస్తూ పర్ణశాలకు వచ్చిపడ్డాడు. విషయం ఏమిటంటే..

మువ్వ భర్త కపిలేశ ఆమెను వెతుక్కుంటూ గడ్డిపాడు నాట్యారామం వద్దకు వచ్చాడట. నాట్యారామంలో బీభత్సం సృష్టించి, సోమాంబికను, పరాశరుణ్ని చావగొట్టి మువ్వను లాక్కుపోయాడట. ఆమె 'గోపాలా గోపాలా!' అంటూ చేస్తున్న ఆర్తనాదాలతో గడ్డిపాడు మార్మోగిపోయిందట.

పరాశరుడు చెప్పింది విని కోపంతో ఊగిపోయాడు జాయపుడు. ఇద్దరూ వెనువెంటనే నంగెగడ్డ వెళ్లారు. మువ్వ, కపిలేశ గురించి వాకబు చేశారు.

''ఉప్పెనకు పొలాలలో మట్టి దిబ్బలు వేసింది. దాంతో ఆడికి చేతినిండా పని. ఏఏ ఊళ్లలో పొలాలు ఇసుకమేట వేశాయో వెదకండి. అక్కడ ఆడు తప్పక దొరుకుతాడు..'' ఓ అనుభవజ్ఞుని సలహా.

అతని మాటపై గ్రామాలన్నీ జల్లెడపట్టారు. మూడు రోజులు వెతగ్గా.. నాలుగోరోజున ఓ చోట అతని ఉనికి తెలిసింది. అది హంసలదీవి. తలగడదీవికి ఎగువనున్న జలదుర్గం.

కృష్ణమ్మ సముద్రుణ్ని సంగమించే ప్రధాన రేవుల్లో హంసలదీవి ముఖ్యమైంది. గతంలో అక్కడే జాయపుని తాత భూమయచోడుడు జలదుర్గం నిర్మించాడు. ప్రస్తుతం అదొక శిథిల దుర్గంగా మిగిలి ఉంది. అక్కడికి చేరారు ఇద్దరూ. అప్పటికే రాత్రి బాగా పొద్దుపోయింది. తిండితిప్పలు లేవు. దగ్గరగా సముద్రపు రొద.

ఉండి ఉండి వినవస్తున్న కెరటాల నురగశబ్దం.. పైన మిణుకు మిణుకుమంటున్న నక్షత్ర మండలం.. పాలిపోయిన ముఖంతో చంద్రుడు..

జాయపునికి మువ్వ మరీమరీ గుర్తొస్తున్నది. ఆమె ముగ్ధ.. అమాయకురాలు. అసలు తానెవరో.. తన పేరు, ఉనికి ఏమీ తెలియదు. తెలుసుకోవాలన్న ఆసక్తి కూడా లేదామెకు. తను ఆమెకు గోపాలుడు.. ఆరాధ్య దేవుడు అంతే! అలాంటి అమాయకురాలికి అన్యాయం జరిగితే తనెలా ఊరుకుంటాడు. వాడి పీచమణచాల్సిందే!

రౌద్రంతో జాయపుడు జ్వలిస్తున్నాడు. పరాశరుడు నీరసించి ఉన్నాడు. అప్పుడు జరిగిందది.

హఠాత్తుగా నలుగురైదుగురు ఒక్కసారిగా జాయపునిపై పడ్డారు. శిథిలాలయ స్తంభాలు, కొండరాళ్ల మీద పడినట్లు. హఠాత్పరిణామంతో వంగి కుచించుకుపోయాడు. అప్పటికే కపిలేశ కొట్టిన దెబ్బలతో శక్తి హీనుడైన పరాశరుడు.. వెంటనే వాళ్లపైకి ఉరికాడు. కానీ, బలిష్ఠులైన ఆ సగరుల ముందు నిలవలేక దూరంపోయి పడ్డాడు. పరాశరుని వల్ల కాస్త తెప్పరిల్లిన జాయపుడు తన విన్యాసాలను వాళ్లకు ఘనంగా చూపసాగాడు.

పాతిక గుర్రాలను, పది ఏనుగులను, వందమంది శత్రుసైనికులను ఏకకాలంలో ఎదుర్కోగల జాయపుణ్ని.. వాళ్లు తమ బలిష్ఠ శరీరాలతో దూకుడుగా పట్టి పైకి ఎగరేశారు. అదే వాళ్లు చేసిన తప్పు!

కిందికి పడుతున్న జాయపుడు లాఘవంగా మోకాలుని మడిచి ఒకడి ఛాతీపై పడ్డాడు. వాడి గుండె బద్దలయ్యింది. దగ్గరికొచ్చిన నలుగుర్ని వెనగ్గా కాళ్లతో తన్నాడు. అప్పటికి వాళ్లకు జాయపుడు కేవలం నాట్యకారుడు మాత్రమే కాదని.. యుద్ధమల్లుడని అర్థమైనట్లుంది. మొరటుగా మూకుమ్మడిగా అతనిపై పడ్డారు. కానీ, జాయపుని నైపుణ్యం ముందు వాళ్ల మోటుతనం సరిపోలేదు. మరోగంట కాలం వాళ్లంతా జాయపునితో యుద్ధం చేసిచేసి అలసిపోయారు. ఏమాత్రం అలసట లేని జాయపుడు వాళ్లను వదిలిపెట్టలేదు.

''మువ్వ ఎక్కడ??''.

దెబ్బలతో రొప్పుతున్నారు కానీ చెప్పలేదు.

''మరోసారి అడుగుతాను.. చెప్పాలి! చెప్పకపోతే మిమ్మల్ని సముద్ర జంతువులకు ఆహారంగా వేస్తాను..'' అన్నాడు.

అప్పటికీ వాళ్లు నోరు తెరవలేదు.

''పరాశరా.. ఆ పార తీసుకో! గోతులు తవ్వడం వచ్చుకదా!?''.

పరాశరుడు ఓపిక కూడగట్టుకుని జాయపుడు చెప్పినట్లు చేయసాగాడు.

అరగంట కాలంలో ఎనిమిది గోతులలో ఎనిమిది మందిని ఛాతీవరకు నిలబెట్టి, చేతులు లోపలపెట్టి గోతులను పూడ్చేశాడు. చేతులు, కాళ్లు వాళ్ల స్వాధీనంలో లేవు. కేవలం కళ్లతో, నోటితో మాత్రమే వాళ్లు ఏమైనా చేయగలరు. ఆ నడిరాత్రి హంసలదీవి సముద్రపు హోరు గాలికి వాళ్లు అరచినా.. ఏడ్చినా ఎవ్వరికి వినిపించడం లేదు. వెళ్తూవెళ్తూ జాయపుడు అన్నమాటలు ఆ కరాళ చీకట్లో.. హోరుహోరున వీస్తున్న గాలితెరల మధ్య వాళ్లకు వినిపించాయి.

''నేను మువ్వను ఎక్కడున్నా విడిపించుకుంటాను. వాణ్ని చంపను. ఆమె విధవ కావడం నాకిష్టం లేదు. కానీ, వాడి ఓ చెయ్యి, ఓ కాలు, ఓ కన్ను తీసుకుపోతాను. పరాశరా.. ఆ పార నాకివ్వు. పారతో వాడి ఒక్కొక్క అంగం నరుకుతున్నప్పుడు.. వాణ్ని కదలకుండా పట్టుకోవాలి. సరేనా!?''.

అన్నట్లుగానే ఆ రాత్రంతా ఆ పరిసరాల్లోని గ్రామాలలో, వాడల్లో వెతికి మువ్వను, కపిలేశను పట్టుకున్నాడు. అన్నమాట నిలబెట్టుకున్నాడు. మువ్వను తీసుకుపోయాడు. కపిలేశను అష్టావక్రుణ్ని చేశాడు.

తెల్లవారేసరికి సముద్రంలోకి వేటకు వెళ్లిన జాలరులకు తీరంవద్ద గుంపులు గుంపులుగా జనం ఏదో చోద్యం చూడటం ఆసక్తి కలిగించింది. వాళ్లు గుంపువద్దకు పరుగుపెట్టారు.

మసకమసక వెలుగులో తీరమంతా రాబందులు, గద్దలు, కాకులు.. మరేవేవో తెలియని, ఎప్పుడూ చూడని భయపెట్టే పక్షులు.. కుక్కలు, నక్కలు, ఎలుగులు, ఎలుకలు.. నీట్లోంచి బయటికి వచ్చిన ఏవేవో వింత నీటి జంతువులు, పాములు, నెర్రల్లోంచి బయటికి వచ్చిన ఎండ్రకాయలు, చేప పిల్లలు, రొయ్యలు..

వాటి మధ్య ఎనిమిది గోతుల్లో సగభాగం శరీరం పూడ్చిఉన్న ఎనిమిదిమంది కనిపించారు. ఒకడికి కళ్లు లేవు. ఒకడికి చెవిలేదు. బుగ్గలు, పెదాలు, భుజాలు, మెడ.. శరీర భాగాలను ఈ జంతువులన్నీ తెల్లవార్లూ కొరికికొరికి తిన్నట్లు.. రక్తం కొంత గడ్డకట్టి.. కొంత కారుతూ.. చచ్చారో.. కొనఊపిరితో బతికున్నారో..

చూసినవారి కడుపులో తిప్పి అందరూ భళ్లున వాంతి చేసుకున్నారు.

* * *

కూసెనపూండి కళాకేంద్రం. జాయపుని కళల కళాక్షేత్రం! కూసెనపూండి, గడ్డిపాడు గ్రామాల మధ్య, కృష్ణమ్మతీరంలో పాతిక నివర్తనాల భూమిలో ఈ క్షేత్రనిర్మాణం జరుగుతున్నది. అత్యున్నత ప్రమాణాలతో నాట్యప్రదర్శన కేంద్రం, దేశీ విదేశీ నాట్య పరిశోధన కేంద్రం, గ్రంథాలయం, నాట్యారామం, భోజనశాల, దూరంనుంచి వచ్చేవారికి నివాస సముదాయం.. అన్ని సౌకర్యాలతో నిర్మాణం జరుగుతున్నది.

పృథ్వీశ్వరుడు నియమించిన దాచిన గణపయ్య ప్రగడ అనే మంత్రి ఆధ్వర్యంలో నిర్మాణం ఓ పక్క జరుగుతుండగానే.. మరో పక్క వెలనాడు, ద్వీప పండితులతో జాయపుడు తన పర్ణశాలలో కవిపండిత గోష్ఠి కొనసాగిస్తూనే ఉన్నాడు. ఓరోజు సిద్ధయ ఓ నాట్యాచార్యుడితో వచ్చి జాయపునికి పరిచయం చేశాడు. ఆ వచ్చిన వాడు కంకుభట్టు. జాయపుణ్ని చూసి ఆశ్చర్యపోయాడు.

''అరె.. ఈ కూసెనపూండి కళాకేంద్రాన్ని నిర్వహిస్తున్నది తమరా..!? ఎవ్వరో రాజబంధువు తమ ఊళ్లో కళాకేంద్రం నిర్వహిస్తున్నట్లు సిద్ధయ భాగవతులు చెబితే చూద్దామని వచ్చాను!''.

ఇద్దరూ ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. జాయపునికి పూరీ జగన్నాథాలయం వద్ద నాట్యపోటీల సంగతి గుర్తుంది. దాని ప్రసక్తి తెచ్చాడు.

''అవునవును. జగన్నాథాలయం కొత్తగా కట్టినది కావడం వల్ల ఆలస్యం అయ్యింది. త్వరలోనే బయల్దేరబోతున్నాము. మీరు ఎవరో నాట్యకారిణి గురించి చెప్పారు. ఆమె సిద్ధమేనా..?!'' అడిగాడు కంకుభట్టు.

**(సశేషం)**